


# సావిరహే

-వియోగి

'మొగాడివైతే పెళ్ళి చేసుకో అని ఛాలెంజ్ చేశాను' ఆవేశంగా వినిపిస్తున్నది ఓ స్త్రీ గొంతు. ఎవరు అంతగా ఆవేశపడుతున్నారని ఆశ్చర్యపోతూ లోపలికి వచ్చాడు నిత్యానందం.

ఆమె అందంగా ఉంది... శ్రీమతి ఎదుట కూర్చునుంది. నిత్యానందంను చూడగానే లేచి నిలబడింది.

'కూర్చోండి!' మర్యాదగా చెప్పాడు.

'ఈమె పేరు రంజని... మనోరంజని! నా కొలీగ్!' పరిచయం చేసింది శ్రీమతి రాధ. 'మా వారు నిత్యానందం గారు - ఇంజనీర్' చెప్పింది.

'నమస్కారం అంకుల్! ఆంటీ మీ గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటారు. కాని మిమ్మల్ని చూడ్డం ఇదే మొదటిసారి' సిగ్గు పడుతూ నమస్కరించింది రంజని.

నిత్యానందం ఆమెను పరీక్షగా చూశాడు. బోసి మెడ - ఖరీదు కాని దుస్తులు కనిపిస్తాయి. కాని సహజ అందం ముందు అవన్నీ వెలవెలబోతున్నాయి.

ఈలోగా రాధ ట్రేలో మూడు ద్రాక్షారసం గ్లాసులు పట్టుకొచ్చింది. ఆమె కొకటి ఇచ్చి - అతని కొకటిచ్చి - తనొకటి తీసుకుని కూర్చుంది.

'ఎనీ ప్రాబ్లెం' నిత్యానందం అడిగాడు యధాలాపంగా.

'ప్రాబ్లెం - మీకు తెల్సుగా మేం జూనియర్ కాలేజీలో పని చేస్తున్నాం - నేను లెక్చరర్‌నే! పిల్లలకు సుద్దులు నేర్పాల్సిన పెద్దలు - బుద్ధులు మర్చిపోయి నా వెంట పడుతున్నారు' ఆమె సిగ్గుతో చెప్పింది.

'కాలేజీలో చదువు చెప్పరా? ఈ ప్రేమలు - దోమలు ఏంటి? అసలేం జరిగింది?' నిత్యానందం కుతూహలంగా అడిగాడు.

'మా మేథ్స్ సారు నా వెంట పడుతున్నాడు - అతడి పేరు శర్మ - కాని నా కర్మ కొద్దీ అతను నా వెంట తిరుగుతున్నాడు...' చెప్పింది రంజని.

'వెంటపడొద్దని చెప్పలేదా?' నిత్యానందం.

'ఆ! అయింది నాలుగైదుసార్లు చీవాట్లు పెట్టాను. నాకు నువ్వంటే ఆ అభిప్రాయం లేదని చెప్పాను. కాని నేను లేందే బతకలేనంటున్నాడు' రంజని గర్వంగా చెప్పింది.

'శర్మ బాగుండడా? చదువు లేదా?' నిత్యానందం అడిగాడు.

'ఆ! బావుండకేం - మన్మథుడే. చదువా - పీకల దాకా చదివేశాడు' మనోరంజని చెప్పింది పులకరించి పోతూ.

'మరి - పెండ్లి చేసుకోవచ్చుగా - మీకు అభ్యంతరమా?' నిత్యానందం.

'ఆ! నాకేం లేదు ముందు వద్దనుకున్నాను. కాని మానవుడు తెగ తిరుగుతుండేసరికి - పోనీలే - అనుగ్రహిద్దామనుకున్నాను' చెప్పింది సిగ్గుపడుతూ.

'మరి ఇంకా సమస్యేం ఉంది. రెండు చేతులు కలిస్తే చప్పట్లు - రెండు మనసులు కలిస్తే ముచ్చట్లు' చెప్పాడు.

'ఇప్పుడు మా ఇంట్లో ఒప్పుకోవడం లేదు అంటున్నాడు' రాధ చెప్పింది.

'ఇప్పుడు కులాలు గుర్తుకొచ్చాయి. తను బ్రాహ్మడుట - నేను రెడ్డినట... ఇంట్లో వాళ్ళమ్మా వాళ్లు ఛస్తానంటున్నారట!' రంజని చెప్పింది ఆవేశంగా.

'నిజమే - మన సొసైటీ ఇంకా మారలేదు. కులాంతర వివాహాలు చేసుకునేటంత గొప్ప సీను లేదు. అన్నాడు నిత్యానందం.

'మరి నా వెంట ఎందుకు పడాలి? నాలో ఆశలు ఎందుకు రేకెత్తించాలి - మేము పేదవాళ్లమనా? వాడుకుని వదిలేద్దామనా?' కొత్త పాత లేకుండా రంజని అలా మాట్లాడుతూంటే ఆశ్చర్యమేసింది నిత్యానందంకు.

'ఇంత దూరం వస్తుందనుకోలేదు జీవుడు!' రాధ అంది.

'అందుకే ఈ రోజు నిలదీసి అడిగాను - నా వెంట పడ్డం కాదు మొగాడివైతే నన్ను పెళ్లి చేసుకో అని' మనోరంజని రాని కన్నీరును జేబు రుమాలుతో తుడుచుకుంది. జారని ముంగురులను - పైటను సవరించుకుంది.

'ఇంక మళ్లీ మీ జోలికి రాడు లెండి' నిత్యానందం చెప్పాడు.

ఆ తర్వాత నాలుగు పిచ్చాపాటి కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది రంజని.

రాధ - రంజని పనిచేసేది ఒకే జూనియర్ కాలేజీలో. ఓ కాలేజీ అన్నారే గాని - ఆ కాంప్లెక్సులో ఎల్.కె.జి. నుండి ఇంటర్ దాకా చెబుతారు అక్కడ. టీచర్లు తరచూ మారుతూ ఉంటారు. సరైన జీతాలు ఇవ్వకపోవడం ఒక కారణం ఇంకోటి మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ సరిగా లేకపోవడం.

రంజని చేరి ఓ ఆరేడు నెలలైనట్లుంది.

కాని నిత్యానందం నోటీసుకు అంతకు ముందు ఎటువంటి ప్రేమ గోలలు రాలేదు - రాధ మూడేళ్లుగా ఆ కాలేజీ కమ్ స్కూలులో పని చేస్తున్నా! ఆడ - మగ ఎక్కువగానే ఉన్నా ఎవరి దోవ వారిది. ఇలా రంజనిలా ఎవరూ ఇంటికి వచ్చేవారు కాదు. ఎక్కువ అతను లేని సమయంలో రంజని వచ్చేది.

ఆ రోజు ఆదివారం - విశ్రాంతిగా బద్ధకంగా మేగజైన్లు చూస్తున్నాడు.

తుఫానులాగా వచ్చింది రంజని.

'అంకుల్! ఆఫీసుకు పోలేదా?' కుర్చీలో కూర్చుంటూ అడిగింది 'ఆంటీ ఉందా?' లోపలికి తొంగి చూస్తూ ప్రశ్నించింది.

'ఆదివారం కదమ్మా! ఆదివారం కూడా ఆఫీసుకు పోవాలంటే ఇంక రెస్టు ఎప్పుడుంటుంది? అవును నువ్వు ఇంట్లో కూర్చోకుండా - ఎండలో పడి వచ్చావు?' అడిగాడు.

'ప్రైవేటు క్లాసు తీసుకోవాలని వచ్చాను - ఆంటీ! మంచినీళ్ళు'

సదరు ఆంటీ రాధ వచ్చింది గ్లాసు నీళ్లతో. ఆ పిలుపు ఆమె కిష్టముండదని నిత్యానందంకు తెల్సు. నలభైలో వున్న రాధకు ఆంటీ అన్న పిలుపు అయిష్టం.

నిత్యానందం ప్రశ్నార్థకంగా రాధ వంక చూశాడు.

'కృష్ణమూర్తి అని ఓ తెలుగు సారున్నాడు లెండి... బహు కుటుంబీకుడు! ఎప్పుడూ ఈ భూభారం అంతా తనే మోస్తున్నట్లు వంగి పోయి నడుస్తూ ఉంటాడు' రాధ చెప్పింది.

'అయితే ఏంటిట?' అడిగాడు.

'ఆయనకు కూడా నేను కావల్సి వచ్చాను. ఈ రోజు ఒంటరిగా వున్న నన్ను చూసి 'ఐ లవ్ యూ' అన్నాడు' రంజని చెప్పింది ఆవేశంగా.

'ఊరుకున్నావా?' రాధ అడిగింది.

'ఈ మొగాళ్ళకేం పని లేదా- అందంగా వున్న ఆడది కనిపిస్తే చాలు ప్రేమించడమే పనా!' రంజని అడిగింది.

'కృష్ణమూర్తికి పెళ్ళయిందా?' నిత్యానందం నమ్మలేక అడిగాడు ఆలోచిస్తూ.

'ఆ! ముగ్గురు పిల్లలు కూడా!' చెప్పింది రాధ.

'మరి ఇవేం బుద్ధులు - డీసెంట్‌గా బిహేవ్ చెయ్యలేడా?' నిత్యానందం.

'ఆ మాటకొస్తే కృష్ణమూర్తి కొంచెం డీసెంటుగా ప్రవర్తించినట్టే లెక్క. చాలామంది మగ టీచర్లు - లెక్చరర్లు నే వచ్చేసరికి నా టేబుల్ మీదో - నా పుస్తకంలోనో - మీదో ఏదో స్లిప్పో, ప్రేమలేఖో పెడుతూ ఉంటారు' రంజని చెప్పింది.

'ఎంతమంది ఉన్నారు మగాళ్ళు!' నిత్యానందం అడిగాడు.

'ఓ పది మంది దాకా ఉన్నారు - ప్రిన్సిపాలుతో కలిపి పదకొండు మంది' చెప్పింది రంజని.

'ప్రిన్సిపాలు ముసలాడు గదా' నిత్యానందం.

'ఆ! రంభను చూస్తే బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు అన్నారుగా - అమ్మా! రంజనీ' అంటూ తల మీద చెయ్యి వేస్తాడు - షేక్ హ్యాండిస్తాడు ముసలాడు. సొల్లు కార్చుకుంటూ మాట్లాడతాడు' రంజని చెప్పింది, యాక్షన్ చేసి చూపిస్తూ.

నిత్యానందం అదిరిపోయి వింటున్నాడు.

'రామారావు అని ఓ సైన్సు టీచరున్నాడు - నలభై ఐదు పైనే వయసు - ఇంటర్ చదువుతున్న కూతుళ్ళు ఇద్దరున్నారు. నేను కనిపిస్తే చాలు - ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది... మొహం చాటంత చేసుకుని ఏవో పిచ్చి వాగుళ్ళు వాగుతూ ఉంటాడు' రంజని చెప్పింది ముక్కు చీదుకుంటూ.

'ఇంతకు శర్మ ఏమయ్యాడు?' నిత్యానందం.

'అతన్ని లైన్లో పెట్టాను - ఎంతో మంది నాకు లైను వేస్తూ వున్నారు. అందులో ఒకడులే అని అనుకుంటే - నేను లేంది ఆత్మహత్య చేసుకుంటా నంటున్నాడు - ఏం చేద్దాం - అందుకని అతని ప్రేమను అంగీకరించలేను - తిరస్కరించలేను - అలా కాలం గడుపుకొస్తున్నా!' చెప్పింది - శర్మ పట్ల జాలిని ప్రదర్శిస్తూ.

ఆమె ఎంతో తెలివిగలది అనిపించింది నిత్యానందంకు. తన అందం పట్ల శ్రద్ధయే కాకుండా - ప్రజల పట్ల - వారి ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ అనుకున్నాడు.

'అబ్బబ్బ! ఈ మొగాళ్లతో చచ్చిపోతున్నా! నేనేమన్నా భూలోక రంభనా! అందరూ నా వెంట పడుతున్నారు!' ఆశ్చర్యపోయింది అందంగా.

'ఈ వయసులో - కాలేజీ లెక్చరర్‌గానే ఇన్ని కష్టాలు పడుతున్నావే - ఇంక నువ్వు కాలేజీ చదివే రోజుల్లో ఎవరూ నీ వెంట పడలేదా?' రాధ అడిగింది.

'ఎందుకు లేదు - నా కోసం ముగ్గురు ప్రాణాలు తీసుకున్నారు' మెరిసే కళ్లతో గర్వంగా చెప్పింది రంజని.

'నిజంగా!' ఆశ్చర్యపోయాడు నిత్యానందం.

'ఆ! శ్యామ్ అనే కుర్రాడు భలేగుండేవాడు - మంచి అందగాడు లక్షలాధికారి - నేనంటే పడి చచ్చేవాడు. రోజూ బాడీ గార్డులా వెంటపడేవాడు. పోనీలే మనదేం పోయిందని ఊరుకున్నా! ఓ రోజు లవ్ లెటర్ చేతిలో పెట్టాడు' రంజని చెప్పింది, గతాన్ని గర్వంగా గుర్తు చేసుకుంటూ.

'ఏమని?' అడగకుండా ఉండలేక పోయాడు నిత్యానందం.

'నేను నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను - వారం రోజుల్లోగా నా ప్రేమను అంగీకరిస్తే పెళ్లి చేసుకుంటాను - లేదా నాకు మరణమే శరణం అన్నాడు'

'మరి చేసుకోలేక పోయావా?' రాధ సానుభూతితో అడిగింది.

'ఊహూ! నేను ఒప్పుకోలేదు. మరునాడే చెప్పేశాను. నాకటువంటి ఉద్దేశాలు లేవని నా వెంట పడొద్దని... ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు - నువ్వు చేసుకున్నా - నేనేం చేయలేనని చెప్పేశాను-' మనోరంజని నవ్వుతూ చెబుతున్నది.

'మరి అతనేం చేశాడు?' నిత్యానందం.

'ఆత్మహత్య చేసుకున్నాడు. విషం మింగి చచ్చిపోయాడు. ప్రిన్సిపాలుకు ఓ లెటరు రాసి మరీ చనిపోయాడు. నాకు భలే ఏడుపొచ్చింది. వారం రోజులు విపరీతంగా ఏడ్చాను. కాలేజీకి పోతూంటే అందరూ నన్నొక హంతకిలా చూశారు' రంజని గొంతులో చిన్న జీర.

'నీ తప్పేముంది ఇందులో! ఇలా వచ్చిన వాళ్లందర్నీ పెళ్లి చేసుకుంటే ద్రౌపదిని మించిపోతావు' రాధ చెప్పింది.

'ఓ మూడు నెలల తర్వాత రజనీష్ వెంట పడ్డాడు పెళ్లి చేసుకుంటానని. - కావాలంటే స్నేహితులుగా ఉందామంటే వినడే! ప్రిన్సిపాలుకు కంప్లయింట్ ఇచ్చాను. కాని కుక్క తోక వంకరలాగా మళ్లీ మొదలు. - క్లాసుకొచ్చి నా ఎదుటే పురుగుల మందు తాగాడు' రంజని గుర్తు చేసుకుంటూ చెప్పింది.

'అరే! చచ్చిపోయాడా!' కంగారుగా అడిగాడు నిత్యానందం.

'నేనే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాను. అతి కష్టం మీద బతికాడు' రంజని.

'ఆ తరవాత సుధాకర్ అనే బంధువు వెంట పడ్డాడు. అతను మంచి పొజిషన్‌లో ఉన్నాడు. కార్లు, జీపులు, నౌకర్లు చాకర్లు అన్నీ ఉన్నాయి. నేనంటే పడి చచ్చేవాడు. పెళ్లి చేసుకోమని నాపైన భలే వత్తిడి తెచ్చేవాడు - ఊహూ! నాకటువంటి ఉద్దేశం లేదని చెప్పేశాను' మనోరంజని చెప్పింది.

నిత్యానందం ఆమె గతంలో మునిగిపోయాడు. ఎంత గొప్ప వ్యక్తి ఈమె అని అంచనా కడుతున్నాడు. బంగారం లాంటి మూడు సంబంధాలు వచ్చినా కాలదన్నుకుంది.

'అంతేనా?' రాధ అడిగింది.

'అబ్బో! ఇంకా చాలామంది ఊరూ పేరూ లేని వాళ్లు ఉత్తరాలు రాసి వేధించారు. కొందరు చచ్చారు - కాని అందరికీ మనం న్యాయం చేకూర్చలేం కదా!' రంజని నిర్లక్ష్యంగా చెప్పింది.

'ప్రతి ఒక్కడూ నాకు లైను వేసేవాడే! లెక్చరర్లతోపాటు - పెద్ద పిల్లకాయలు కూడా తయారవుతున్నారు. భలే నవ్వొస్తోంది. శర్మ లాంటి వాడు చేసినా ఒక అర్థం ఉంది. పెళ్లి కాలేదు. ధైర్యం చేస్తే చేసుకోవచ్చు. పెళ్ళయిన వాళ్ళు, గడ్డాలు, మీసాలు సరిగా మొలవని వాళ్లు నాకు లైను వేసి ఏం చేస్తారు?' రంజని పకపక నవ్వింది.

ఆమె స్పోర్టివ్ స్పిరిట్‌కు నిత్యానందం కూడా నవ్వేశాడు. రాధ నవ్వింది.

'దీనికి తక్షణ పరిష్కారం పెళ్లి చేసుకోవడమే! కన్నెపిల్ల గృహిణిగా మారింత్తర్వాత ఎవరూ కన్నెత్తి చూడరు' నిత్యానందం చెప్పాడు.

'ఏమో చూద్దాం' మనోరంజని చెప్పింది. అల్పాహారం తీసుకుని వెళ్లిపోయింది.

నిత్యానందం - రాధ ఆమె జీవితం గురించి చాలా బాధపడ్డారు. అందంగా వున్నానన్న అహం కొద్దీ ఈమె జీవితం పాడుచేసుకుందనుకున్నారు. లేకపోతే ఇలా ఎన్నాళ్లు బతుకుతుంది. అందరి లైన్లలో పడకుండా. తను బీదరాలు. వచ్చిన వాటిల్లో ఒకటి చేసుకోనుంటే తన వాళ్లకు బరువు తగ్గించినదై ఉండేది.

'ఓ మూడు నెలల తర్వాత రజనీష్ వెంట పడ్డాడు పెళ్లి చేసుకుంటానని. - కావాలంటే స్నేహితులుగా ఉందామంటే వినడే! ప్రిన్సిపాలుకు కంప్లయింట్ ఇచ్చాను. కాని కుక్క తోక వంకరలాగా మళ్లీ మొదలు. - క్లాసుకొచ్చి నా ఎదుటే పురుగుల మందు తాగాడు'

ఓ రోజు నిత్యానందం ఆఫీసులో బిజీగా తన పని చూసుకుంటుండగా - సత్యభామ విసురుగా వచ్చి - ఎదురుగా కూర్చుంది.

'మీకివేం బుద్ధులండి!' అడిగింది.

నిత్యానందం తలెత్తి చూశాడు. సత్యభామ అతని కొలీగ్. పిటపిటలాడుతూ ఉంటుంది. మొహం మీదే అనేస్తుంది ఎవరినైనా. అందం - మంచి ఉద్యోగం ఉందన్న గర్వం ఆమెను అతలాకుతలం చేస్తుంది.

'ఏమైందిప్పుడు?' విస్మయంగా అడిగాడు.

'ఈ వయసులో ఈ వేషాలేంటండి. శుభ్రంగా పెళ్లి చేసుకున్నారు. పిల్లలున్నారు. బాధ్యత గల ఉద్యోగం చేస్తున్నారు. పది మందికి ఆదర్శంగా ఉండాల్సింది పోయి అమ్మాయిల వెంట పడతారా?' సత్యభామ దులిపేసింది.

'ఛీఛీ! నీ వెంట పడలేదన్న కోపంతో నింద లేస్తున్నావు?' నిత్యానందం నవ్వుతూ అన్నాడు.

'నా వెంట పడే వాళ్లు మస్తుగా ఉన్నారు. మీరొక్కరు ఏం తక్కువ కాలేదు. పాపం! అంకుల్ అని చనువుగా పిలవగానే లైన్ వేసేస్తారా?' కోపంగా అడిగింది సత్యభామ. 'మీ మీద మహిళా మండలికి ఫిర్యాదు చేస్తాను' అంటూ కాలు దువ్వింది.

'తల్లీ! సత్యా! నాకర్థం అయ్యేటట్లు చెప్పు. నాకు తెల్సి నేను ఎవరికీ లైను కాదు - లైటు కూడా వేయలేదు' నిత్యానందం బిత్తరపోయాడు ఆమె రౌద్ర స్వరూపానికి.

'మనోరంజని తెల్సుగా! ఆమె తెగ బాధపడిపోతున్నది. అంకుల్‌కు ఈ వయసులో ఇవేం బుద్ధులు! ఆంటీ మొహం చూసి నాలుగు వాయించకుండా వదిలిపెట్టానని' కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ చెప్పింది సత్యభామ.

'అలా అని రంజని మీతో చెప్పిందా?' విస్తుపోయి అడిగాడు.

'నాతో కాదు - మా పక్కింటి ఆంటీ అంది. ఆ కాలేజీలోనే పన్జేస్తుంది. నిన్న ఏదో పుక్కిటి పురాణాల ప్రసక్తి వచ్చి - మీ పేరు కూడా వచ్చింది. ఆ టైంలో నేను అక్కడే ఉన్నాను. నేను మీ కొలీగ్ అన్న సంగతి వాళ్లు మర్చిపోయారు. అప్పుడు విన్నా. పెద్ద ప్రవరాఖ్యుడిలా పోజులు పెడుతూంటారు ఆఫీసులో - ఇంట్లో చేసే పనులు ఇవా? ఛీఛీ! కొంచెం జాగ్రత్తగా బతకండి' కోప్పడింది సత్యభామ.

'సత్యా! నాకేం తెలీదు - నన్ను నమ్ము' చెప్పినా వినకుండా వెళ్లిపోయింది.

నిత్యానందం ఇంటికొచ్చి రాధకు జరిగిన విషయం చెప్పాడు. ఆమె గొడవ చేస్తుందనుకున్నాడు - కాని మధురంగా నవ్వి చెప్పింది.

'ఇలాంటిదేదో రోజు అవుతుందనుకున్నాను'

'అంటే నువ్వు నమ్ముతున్నావా?' బాధగా అన్నాడు.

'ఛీఛీ! మీ గురించి నాకు తెలీదా? పదేళ్ళ క్రితం మీకు స్కూటర్ ఆక్సిడెంట్ అయినప్పటి నుంచీ మీరు దాంపత్య జీవితానికి అనర్హులని నా ఒక్క దానికే తెల్సు కదా! పాపం. ఆ సంగతి దానికి తెలీదు' రాధ చెప్పింది.

'మరి ఎందుకు అలా అన్నారు?'

'కాదు - మీరు లైను వేశారని నమ్మడం లేదు - కాని మనోరంజని అలా చెప్పి ఉంటుందని నమ్ముతున్నాను' రాధ చెప్పింది కళ్లు తిప్పుతూ.

'ఎందుకలా అనుకున్నావు!' ఆశ్చర్యంగా అడిగాడు. రాధ చెప్పింది డిటెక్టివ్ లాగా.

'ఈ మధ్య ఎందుకో మా మగసార్లను ఈమె గురించి వాకబు చేశాను - పాపం! వాళ్లు అమాయకులు. క్లాసులు అయిపోగానే ఎవరింటికి వాళ్లు పోతున్నారు. లైను వేసే టైమెక్కడుందని నిషా వేయించాను ప్యూనులకు చెప్పి. తేలిందేమంటే మనోరంజని చెప్పి వీర గాథల్లో నేతి బీరకాయలో నెయ్యి ఉన్నంత నిజం ఉందని'

'పాపం! లవ్ ఫోబియాతో బాధ పడుతున్నట్లుంది రంజని. మనోవైకల్యానికి మందు లేదు. కనీసం పెళ్లి చేసుకుంటే తగ్గుతుందేమో - వాడెవడో బంధువున్నాడు అందిగా చేసుకోవచ్చుగా' నిత్యానందం సానుభూతి చూపాడు.

'ఊహూ! ఈమెను పెళ్లి చేసుకునే బంధువులు ఎవరూ లేరట. పైగా కాలేజీలో ఈమె కంటే అందగత్తెలు చాలామంది ఉన్నార్ట. వాళ్ల అనుభవాలన్నిటిని తన అనుభవంగా మనకు కథలుగా చెప్పింది' రాధ చెప్పింది.

'అమ్మా! రంజని ఎంత ఫూల్ చేశావు?' నిత్యానందం ఆశ్చర్యపోయాడు.

'కనీసం శర్మనన్నా పెళ్లి చేసుకోమని చెప్పా. కాని ఇంటర్ కాస్ట్ మ్యారేజి తనకిష్టం లేదని చెప్పేశాడు. అతనికి ఇంకో లెక్చరర్‌తో పెళ్లి ఫిక్స్ అయింది కూడా' రాధ చెప్పింది. ఈమెకు పెళ్లి చేయాలంటే వాళ్ల కులంలో డౌరీ చాలా ఎక్కువ ఇవ్వాలి. వాళ్ల తల్లిదండ్రులకు స్తోమత లేదు. ప్రస్తుతానికి వాళ్లు చిన్న సంబంధం కూడా తెచ్చి చేసే పరిస్థితుల్లో లేరు'

'అయితే పాపం! మనోరంజని - ఇలా మనోహర ఊహల్లో విహరిస్తూ ఉండవలసిందేనా!' పగటి కలల్లో లైన్లు వేయించుకుంటూ ఉండాల్సిందేనా!' బాధపడ్డాడు

'మనింటికి రావద్దని చెబుతాను' రాధ అంది కోపంగా.

'వద్దు - ఆమె కబుర్లు వినే శ్రోతలు దొరక్కపోతే ఆమె మరీ పిచ్చిదై పోతుంది. ఈమె స్కిజోఫ్రెనియా జబ్బుతో బాధపడుతున్నట్లుంది. మనం ఎలాగూ ఆర్థికంగా ఆదుకోలేం - కనీసం హార్దికంగా ఆదుకుందాం' నిట్టూరుస్తూ చెప్పాడు నిత్యానందం.

'నిజమే! కాని మనోరంజనికి మనిద్దరం అన్నా దొరికాం - ఈ దేశంలో ఇటువంటి పెళ్లికాని పిల్లలు పెరిగిపోవడం దేశ దౌర్భాగ్యం. పెద్దల బాధ్యతా రాహిత్యం'

నిత్యానందం బాధపడ్డాడు. 'కాని మనోరంజని లాంటి వాళ్లను అర్థం చేసుకుని కూసింత సానుభూతి చూపే వాళ్లుంటే చాలు - అంతేగాని అసలే కుంగిపోతున్న కన్నెపిల్లల మీద మరిన్ని రాళ్లు జల్లి ఇంకా కుంగిపోయేట్లు చేసే ప్రబుద్ధులు ఎక్కడా ఉండకూడదు. పెళ్లికాని పిల్లల్ని, పెళ్లయిన ఆడవాళ్లు సానుభూతితో అర్థం చేసుకోవాలి'

'అన్ని సమస్యలకు పరిష్కారం చూపే కాలం వృద్ధ కన్నెపిల్లలకు ఏం పరిష్కారం చూపుతుందో చూడాలి' సాలోచనగా అంది రాధ.

టీవీలో తన కిష్టమైన పాట వస్తుంటే సౌండ్ పెంచింది.

'సా విరహే తవదీనా' పాట కనిపిస్తున్నది ఛానెల్‌లో. ★